ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శనివారం | జూన్ 20, 2026 | సంపుటి : 7 | సంచిక : 20 | పేజీలు : 2

## పనుల్లో పురోగతి కనిపించాలి




- సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరాలి
- మహబూబాబాద్ ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్

2 లో



# గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

- బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి
- 83 ఎకరాల రక్షణశాఖ భూముల్లో మూసీ ప్రాజెక్టుకు అనుమతి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్, భారత ఆర్మీకి కృతజ్ఞతలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ అనుమతిని మంజూరు చేసింది. 83 ఎకరాల రక్షణ శాఖకు సంబంధించిన భూముల్లో మూసీ ప్రాజెక్టుకు అనుమతిచ్చింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలోని రూ.533 కోట్ల విలువైన భూముల బదలాయింపునకు ఓకే చెప్పింది. అయితే మరోచోట రూ.533 కోట్ల విలువైన భూములు ఇవ్వాలని ప్రభుత్వానికి షరతు విధించింది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత ఆర్మీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూముల బదలాయింపు కీలక మైలు రాయి అని అభివర్ణించారు.

### ముమ్మరంగా భూసేకరణ ప్రక్రియ

మూసీ, ఈసీ నదుల సంగమ స్థలిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనుంది. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అక్కడున్న రక్షణ భూములు ఇవ్వాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిరోజుల క్రితం విజ్ఞప్తి చేశారు. మూసీ, ఈసీ నదుల సంగమ స్థలిలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడుతున్నామని ఆయనకు వివరించారు. అందుకోసం అక్కడున్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కొద్దిరోజుల క్రితం కోరారు. జాతీయ సమైక్యత, గాంధీ విలువలకు సంకేతంగా చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ పరంగా చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో మహాత్ముడి సిద్ధాంతాలను ప్రచారం చేసే విజ్ఞాన కేంద్రం, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ఘాట్లు, శాంతి విగ్రహం, మ్యూజియం నిర్మించనున్నారు. ఇందుకు రక్షణ శాఖ భూములు కూడా అవసరమైనందు వల్ల కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. తాజాగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ అనుమతి మంజూరు చేయడంతో పనులు ముందుకు సాగనున్నాయి.




2 లో

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హనుమకొండ, ఆయుధం: ఆదివారం జరిగే నీట్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో ఈ నెల 21వ తారీకు ఆదివారం జరిగే నీట్ పరీక్ష సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని. ఈ ఉత్తర ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమికూడటం, సభలు సమావేశాలు ర్యాలీలు ధర్నాలు నిషేధించబడ్డాయని, అలాగే పరీక్షా జరిగే పరిసరాలలో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని.. ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని. ఎవరైనా ఈ ఉత్తరం అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# వికాసం వైపు.. విద్యాశాఖ

## గత పాలనలో విధ్వంసం చేశారు : సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** విద్యార్థులు ఆత్మ గౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ‘‘తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం’’ అని రేవంత్‌రెడ్డి అన్నారు.





## నేటి నుండి రైతులకు అందుబాటులో యూరియా

- యాప్ ద్వారా రైతులు నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- యూరియా ఆన్లైన్ బుకింగ్ యాప్ ప్రారంభం

**హనుమకొండ, ఆయుధం:** జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి పంటల సాగుకు యూరియా అందుబాటులో ఉందని, యాప్ ద్వారా రైతులు యూరియా బుకింగ్ చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.



## రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే జీఎస్ఆర్

**భూపాలపల్లి, ఆయుధం:** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు శుక్రవారం భూపాలపల్లి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ సంపూర్ణ ఆరోగ్యంతో దీర్ఘాయుష్షుతో ఉండాలని, భవిష్యత్తులో దేశ ప్రధానిగా సేవలందించాలని ఆకాంక్షించారు. ‘‘రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం’’ అని స్పష్టం చేశారు. దేశంలో ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రధాన ప్రాజెక్టులు, పారిశ్రామిక అభివృద్ధి వంటి కీలక కార్యక్రమాలు కాంగ్రెస్ పాలనలోనే రూపుదిద్దుకున్నాయని ఆయన గుర్తు చేశారు. పేదలకు భూమి హక్కులు, పోడు భూములకు పట్టాలు, కార్మిక సంక్షేమ చట్టాలు, జాతీయాకృత బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతం వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ హయాంలోనే అమలయ్యాయన్నారు. దేశ ప్రజల శ్రేయస్సు కోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని, ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తూ వస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, భూపాలపల్లి టౌన్ ప్రెసిడెంట్ ఇస్లావత్ దేవన్, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రతి దశను నిరంతరం పర్యవేక్షించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హన్మకొండ, ఆయుధం:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హన్మకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, వాటి తిరిగి స్వీకరణ, ఓటరు వివరాల ధృవీకరణ తదితర ప్రక్రియలను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు.




## వర్కింగ్ జర్నలిస్టులకు ఫీజు రాయితీ

**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా లోని అక్రిడిటెడ్, వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 202627 విద్యా సంవత్సరానికి గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో ఫీజు రాయితీ కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ల యూనియన్ (టీయూడబ్ల్యూజేఐజేయూ) వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్ అందజేసిన వినతిపత్రంను పరిశీలించిన అనంతరం జిల్లా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు కందుల శ్రీధర్, ఉపాధ్యక్షులు కూర్న వెంకటేశ్వర్లు, మహాదేవుని జగదీష్, సహాయ కార్యదర్శులు బొమ్మగాని సతీష్ కుమార్, బాదావత్ బాలాజీ, కమిటీ సభ్యులు ఎం.డి.బాబర్, అక్రమ్, కందుల శ్రీనివాసులు పాల్గొన్నారు.




2 లో

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- గత పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారు
- ఇప్పుడు కుట్టు మిషన్ల పంపిణీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

# ఆర్థిక సాధికారతకు శిక్షణలే బలమైన పునాది

- శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- హసన్‌పర్తిలో ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను సందర్శించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




**హనుమకొండ, ఆయుధం:** ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మహిళలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీలు) తమతో పాటు సమాజ ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌సెటీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 64 మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని (ఫైనాన్షియల్ లిటరసీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్) జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహణ, లక్ష్యాలు, అందిస్తున్న అంశాలపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యుల్లో డిజిటల్ లావాదేవీలు, నగదు రహిత చెల్లింపులు, సైబర్ నేరాల నివారణ, బ్యాంకింగ్ సేవల వినియోగం, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలపై సీఆర్పీలకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఇన్‌చార్జి డైరెక్టర్ మహేందర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో మహిళా సంఘాల సభ్యులకు సమర్థవంతంగా చేరవేసి ఆర్థిక అక్షరాస్యతను మరింత విస్తరించాల్సిన బాధ్యత సీఆర్పీలపై ఉందన్నారు. ఆర్థిక వ్యవహారాలపై అవగాహన పెరగడం ద్వారా కుటుంబాలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం సంస్థలో కుట్టు, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న 40 మంది మహిళలతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. శిక్షణ ద్వారా పొందుతున్న నైపుణ్యాలను స్వయం ఉపాధి అవకాశాలుగా మలుచుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలు ఉపాధి అవకాశాలను సృష్టించుకునే దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం సంస్కృతి విహార్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, తహసీల్దార్ కిరణ్ కుమార్, డీఈఈ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



## సిబ్బంది సమస్యల పరిష్కారానికి సీపీ గ్రీవెన్స్


**వరంగల్, ఆయుధం:** పోలీస్ అధికారులు, సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వరంగల్ రేంజ్ కార్యాలయంలో 3, 4 జోన్ల సిబ్బంది కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. పదోన్నతులు, బదిలీలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించి సిబ్బంది నుంచి వచ్చిన 13 దరఖాస్తులను సీపీ స్వయంగా పరిశీలించారు. ఈ సమస్యలను చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- డీసీసీ అధ్యక్షులు ఇనగాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు
- పాల్గొన్న పీసీసీ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు జిల్లా కమిటీ నాయకులు

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కొనియాడారు. హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించిందన్నారు. ద్వేషపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా, దేశ ప్రజలను ఏకం చేసేందుకు ఆయన పడిన శ్రమ అమూల్యమైనదని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ప్రజల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇ.వి శ్రీనివాస్ రావు, వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

- గత పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారు
- ఇప్పుడు కుట్టు మిషన్ల పంపిణీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**నడికూడ, ఆయుధం:** గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. నడికూడా మండలంలోని శుక్రవారం ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్మారం, రామకృష్ణాపురం, కంటాత్మకూర్, సర్వాపురం, కౌకొండ గ్రామాలలో ఎం జివన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు, కాంట్రాక్టర్లను చూసి అభివృద్ధి పనులు చేపట్టారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాలలోని ప్రతి వార్డులోను ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని తెలిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రజా ధనాన్ని దోచుకొని పాపాలు పోవడానికి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి కాంట్రాక్టర్ ముసుగులో దోచుకుతున్నాడని తెలిపారు. పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తున్నమన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూ గ్యాస్ సిలిండర్, 2 లక్షల లోపు రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్న వడ్లకు 500 రూ బోనస్, గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు, ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు.



## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు..

- మొక్కలు నాటిన సర్పంచ్ బండి రేణుక శంకర్

**నడికూడ, ఆయుధం:** నడికుడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ మొక్కలను నాటారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో మొక్కలను నాటాలని లేదా పిల్లల పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటాలని తల్లిదండ్రులను ఈ సందర్భంగా కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ.. చెట్లు మనకు ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను అందిస్తాయని, చెట్లు పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుతాయని, చెట్లు మనకు నీడను ఇస్తాయని, చెట్లు పండ్లు, పూలు, ఔషధాలను అందిస్తాయని, చెట్లు వర్షపాతం పెరగడానికి సహాయపడతాయని, చెట్లు నేల కోతను నివారిస్తాయని, పక్షులు, జంతువులకు చెట్లు ఆశ్రయం కల్పిస్తాయని, చెట్లు వాతావరణ సమతుల్యతను కాపాడుతాయని, ప్రతి మనిషి కనీసం ఒక చెట్టును నాటాలని, చెట్లను రక్షించడం మన అందరి బాధ్యత అని అన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రము 1, 2 లలో సర్పంచ్ బండి రేణుక శంకర్ అంగన్వాడి విద్యార్థులకు ఉచిత యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఉపాధ్యాయులు కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్యా, గ్రామపంచాయతీ సిబ్బంది శరత్, ఆయాలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో పురోగతి కనిపించాలి

- సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరాలి
- మహబూబాబాద్ ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్




**ములుగు, ఆయుధం:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో పనిచేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రాధాబాయి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా పోలీసు అధికారి సుధీర్ రామ్‌నాద్ కేకన్, అటవీ శాఖ జిల్లా అధికారి వికాస్ మీనా, దిశా కమిటీ సభ్యులు పూర్ణచందర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పోరిక బలరాం నాయక్ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించి, పనుల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు కోసం తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాల విద్యార్థులతో గిరిజన ప్రాంతాలలో వైద్య శిక్షణ శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమగ్ర శిక్ష కార్యక్రమం, మధ్యాహ్న భోజన పథకం అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.
వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, ఆన్లైన్ విధానం ద్వారానే ఎరువుల కొనుగోలు, అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.
ములుగు, ఏటూరునాగారం ప్రాంతాలలో రింగ్ రోడ్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన పనుల జాబితాను రూపొందించి ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల పనితీరుపై దిశా సమావేశంలో సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, ఆరోగ్య శాఖలో ఓపీ సేవలు, మందుల లభ్యత, వైద్య పరికరాల అందుబాటు, పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.
సమావేశానికి హాజరైన మహిళా కమిషన్ సభ్యులు, దిశా కమిటీ సభ్యులు, అధికారులు, సమన్వయంతో సహకరించారని, జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశా సమావేశం నిర్వహిస్తూ అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రవికుమార్, ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవా కార్యక్రమాలే ట్రస్ట్ లక్ష్యం

- ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**వరంగల్, ఆయుధం:** వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశీబుగ్గ KVS ప్రాంతంలో శంకర్ కంటి హాస్పిటల్ వారి సహకారంతో ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 2000 మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఈ కంటి వైద్య శిబిరంలో పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు. నిపుణులైన వైద్యుల బృందం పాల్గొని రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, తదుపరి చికిత్సపై సూచనలు అందించారు.
ఈ సందర్భంగా ఎర్రబెల్లి వినీత్ రావు మాట్లాడుతూ, "ఎర్రబెల్లి ప్రదీప్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం మా ట్రస్ట్ ప్రధాన లక్ష్యం. ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు. ముఖ్యంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి ఉచిత కంటి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాము. శిబిరంలో భారీగా ప్రజలు పాల్గొనడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతాము" అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తక్కెళ్ళపల్లి రాజేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, రత్నం సతీష్‌షా, మల్లాడి తిరుపతిరెడ్డి, రాణా ప్రతాపరెడ్డి, త్రిలోక్ , స్థానిక నాయకులు, వైద్యులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వెలమ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



**పరకాల, ఆయుధం:** వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గా ఎన్నికైన జువ్వాడి నర్సింగరావు ను పరకాల కుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సత్కరించడం జరిగింది. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే బీజేపీ ధ్యేయం

- బీఎల్ఏ-2 సైనికుల్లా పనిచేయండి.
- జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- ప్రజాస్వామ్య పరిరక్షణకు బిజెపి శ్రేణులు కదలాలి.
- మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, ధర్మారావు




**వరంగల్, ఆయుధం:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ2026 ప్రక్రియలో బీఎల్ఏ2 పాత్ర అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో S.I.R జిల్లా కోకన్వీనర్ బన్న ప్రభాకర్ అధ్యక్షతన సత్యం గార్డెన్స్ పున్నేల్ లో నిర్వహించిన ఈ కార్యాశాలలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మర్తనేని ధర్మారావు, జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, టి.రాజేశ్వర రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, జిల్లా ఎస్.ఐ.ఆర్ కన్వీనర్ బాకం హరిశంకర్, బీఎల్ఏ1 కొండేటి సత్యం పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, ఒకే ఓటరుకు రెండు చోట్ల ఓటు హక్కు లేకుండా క్షేత్ర స్థాయిలో పూర్తి పారదర్శకతతో జాబితాను సవరించాలి. కాంగ్రెస్ పార్టీ అధికార బలంతో వర్ధన్నపేట నియోజకవర్గంలో బిజెపికి మద్దతుగా ఉండే ఓటర్ల పేర్లను అక్రమంగా తొలగించాలని చూస్తోందని, ఇలాంటి కుట్రలను బిజెపి శ్రేణులు అడ్డుకోవాలని వారు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉంది. క్షేత్రస్థాయిలో ప్రజాధరణ కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ, రాబోయే రోజుల్లో దొంగ ఓట్లతో గెలవాలని చూస్తోందని.. ఓటర్ల సవరణ ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తోందని మండిపడ్డారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడిని గుర్తించి, ఫారం6 ద్వారా వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్పించేలా BLAలు చురుగ్గా వ్యవహరించాలి. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల దృష్టిని మళ్లించడానికి ఓట్ల రాజకీయం చేస్తోందని విమర్శించారు. మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, జాబితా నుంచి తొలగించేందుకు అధికారులకు సహకరించాలి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, ఓటు చోరీ జరగకుండా క్షేత్రస్థాయిలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని బీజేపీ శ్రేణులను ఆదేశించారు. బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రతి BLA సైనికుడిలా పనిచేసి నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియను జయప్రదం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అక్రమ మార్గాల్లో ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గురుమూర్తి శివకుమార్, సర్పంచులు కన్నయ్య, రమ్యరాజు, నియోజకవర్గ బీఎల్ఏ2, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం



**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లాలోని పంతిని గ్రామంలో గల పాఠశాలలో 2026 2027 విద్యా సంవత్సరానికి గాను ఎంపీపీఎస్ పంథిని కి ప్రభుత్వ అనుమతి లభించిన ప్రీ ప్రైమరీ తరగతులను రిబ్బన్ కట్ చేసి గ్రామ సర్పంచ్ అర్షనపల్లి శ్రీరామ్ భూపాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పులి ఆనందం, ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, మాలతి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జక్కం కిషన్, వార్డు సభ్యులు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఏఏపి చైర్మన్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేటి నుండి రైతులకు అందుబాటులో యూరియా

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి పంటల సాగుకు యూరియా అందుబాటులో ఉందని, యాప్ ద్వారా రైతులు యూరియా బుకింగ్ చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో వ్యవసాయ సంబంధిత అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒక లక్షా ఎనభై తొమ్మిది వేల యూరియా బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. నిల్వ చేసుకోకుండా అవసరాన్ని బట్టి రైతులు యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఇంకా జిల్లాకు పెద్ద ఎత్తున సరిపోను స్టాక్ వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో రైతులు వివిధ పంటల సాగు చేపడతారు కాబట్టి అన్నీ మండలాల్లో సరిపోను డీఏపీ, యూరియా నిల్వలు అందుబాటులో ఉండాలన్నారు. యూరియా తీసుకోవడానికి సంబంధిత ఆన్లైన్ యాప్ లో రైతులు సులువుగా నమోదు చేసుకునేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సేల్ పాయింట్ వద్ద యూరియా, ఇతర నిల్వలకు సంబంధించిన వివరాలు తెలియజేసేవిధంగా రికార్డును నిర్వహించాలని సూచించారు. రైతు నేస్తం రిపోర్ట్ అందజేయాలన్నారు. రైతులు రైతు నేస్తం ప్రోగ్రాంకు హాజరయ్యే విధంగా చేయాలన్నారు. రైతు వేదికలలో నెట్వర్క్ సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. యూరియా ఆన్లైన్ బుకింగ్ సిస్టమ్ ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, ఏడిఏ ఆదిరెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారి కమలాకర్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల పంపిణీలో ప్రభుత్వం వైఫల్యంతోనే భూపోరాటాలు

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో భారీ ధర్నా
- అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్




**హనుమకొండ, ఆయుధం:** ఇండ్ల స్థలాల పంపిణీలో ప్రభుత్వ వైఫల్యంతోనే పేదలు భూపోరాటాలు నిర్వహిస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు వామపక్షాల నాయకులు, పెద్ద సంఖ్యలో పేద ప్రజలు, మహిళలు తరలివచ్చారు.ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు హాజరై మాట్లాడుతూ భూపోరాటాల ద్వారా ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని దశాబ్దాలుగా నివాసముంటున్న, నిరుపేదలైన ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఒకవైపు పేదలకు గూడు లేక ఇబ్బంది పడుతుంటే, మరోవైపు విలువైన ప్రభుత్వ భూములు ల్యాండ్ మాఫియా పరం అవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి హనుమకొండ జిల్లాలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సిపిఎం జిల్లా నాయకులు ఎం.చుక్కయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు, కర్రె బిక్షపతి, జి.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మండల కార్యదర్శి ఎన్. అశోక్ స్టాలిన్, కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, నేదునూరి రాజమౌళి, వేల్పుల సారంగపాణి, బత్తిని సదానందం, రాసమల్ల దీన, సిపిఎం జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, వీరన్న, మంద సంపత్, గొడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695